
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

సోమవారం 23 డిసెంబరు 2024

'ప్రజావాణి' రేపటికి వాయిదా

● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ఉన్నందున నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారానికి వాయిదా వేసినట్లు కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి మంగళ వారం ప్రజావాణికి రావాలని ఆయన సూచించారు.

క్రీస్తు మార్గం

సర్వశ్రేయస్కరం

- ప్రేమ, శాంతి సందేశాల ద్వారా లోకోద్ధరణ
- మెదక్ చర్చి ఆసియా ఖండంలోనే అద్భుతం
- సీఎస్ఐ దయాసిస్ సేవలు వెలకట్టలేనివి
- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- మెదక్ క్యాథడ్రల్ చర్చి శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించిన గవర్నర్



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు మెదక్ చర్చి నమూనాను అందజేస్తున్న నిర్వాహకులు

మెదక్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు తన శాంతి సందేశాల ద్వారా లోకోద్ధరణ గావించారని, తద్వారా క్రీస్తు బోధనలకు జీవమిచ్చే ప్రతీకగా మెదక్ క్యాథడ్రల్ నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ క్యాథడ్రల్ సీఎస్ఐ చర్చి నిర్మాణం పూర్తయి వంద సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. క్రైస్తవ గురువులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. క్రీస్తు బోధనలను ఉటంకిస్తూ 'ఎక్కడ జనాలు గుమిగూడి ఉంటారో అక్కడ నేను వారితో ఉంటాన'ని బైబిల్‌లో మాటలను ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడుల నుంచి ఉపశమనమిచ్చి భవిష్యత్ తరాల ఆశలసౌధంగా నిలిచే దేవాలయాన్ని నిర్మించిన స్వప్నాన్ని తాను చూస్తున్నానన్నారు. గోతిక్ శైలిలో నిర్మించబడిన ఈ క్యాతలిక్ చర్చి ఆసియా ఖండంలోనే అతిపెద్ద చర్చిల్లో ప్రముఖంగా నిలుస్తోందని కొనియాడారు. ఇది సమాజం ఉమ్మడిగా కలిసికట్టుగా నిర్మించిన అద్భుత కట్టడమని ఆయన ప్రశంసించారు. కరువుకాటకాలతో విలవిలలాడుతున్న మెదక్ ప్రజలను ఆదుకోవడానికి, వారికి ఉపాధి కల్పించడానికి క్రైస్తవ మత బోధకుడు, సంఘ సంస్కర్త రెవరెండ్ ఛార్లెస్ వాకర్ పాస్నెట్ చర్చి నిర్మాణం చేపట్టడం హర్షనీయమన్నారు. సీఎస్ఐ దయాసిస్ పరిధిలో ఎన్నో వైద్యాలయాలు, విద్యా కేంద్రాలు ఏర్పాటుచేసి సమాజానికి సేవలందుస్తుండడం వారి సేవాతత్పరకు నిదర్శనమన్నారు. వంద సంవత్సరాల చర్చిని మనకు ఇచ్చి దైవానుగ్రహం కలిగించినందుకు ప్రభువుకు కృతజ్ఞతలు తెలియజేసుకుందామని పేర్కొన్నారు. అనంతరం ఆయనను ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, బాని, మెదక్ డయాసిస్ సభ్యులు చర్చి కట్టడం గురించి వివరించారు. ఈ సందర్భంగా పర్యాటకుల డైరీలో చర్చి కట్టడాన్ని ప్రశంసిస్తూ గవర్నర్ సంతకం చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

మెదక్ జిల్లా పర్యటన కోసం విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లో మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం మెదక్ చర్చిని సందర్శించిన గవర్నర్‌కు నిర్వాహకులు ఎర్రతివాచీతో స్వాగతం పలికారు. అనంతరం చర్చి నమూనా బహూకరించి ఘనంగా సత్కరించారు. గవర్నర్ పర్యటనకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, నిర్వాహకులు

గవర్నర్ టూరు

తారుమారు

- తొలుత రంగనాయకసాగర్ గెస్ట్‌హౌజ్ చేరుకుంటారని షెడ్యూల్
- అప్పటికే ప్రైవేట్ పార్టీకి రెంట్‌కు ఇచ్చిన పర్యాటకశాఖ
- తుదకు కలెక్టరేట్‌కు మారుస్తూ నిర్ణయం
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం!
- ఏబీవీపీ మహాసభల ప్రారంభానికి నేడు సిద్దిపేటకు గవర్నర్ రాక



FROM: THE SECRETARY TO GOVERNOR, RAJ BHAVAN, HYDERABAD

Message No.62/T/2024-III DATED: [illegible]

Monday, the 23rd December, 2024:

0930 Hrs.	DEP:	Shri Jishnu Dev Varma, the Governor of Telangana along with Officers leaves for Integrated District Offices Complex, Siddipet District by Road
1110 Hrs.	ARR:	Integrated District Offices Complex (IDOC), Siddipet District
1110 Hrs. to 1120 Hrs.		RESERVED
1120 Hrs.	DEP:	Integrated District Offices Complex (IDOC), Siddipet District for Siddipet Ground, Siddipet District
11[illegible] Hrs.	ARR:	Siddipet Ground, Siddipet District
11[illegible] Hrs. to 1230 Hrs.		Inauguration of 43rd State Conference of Akhil Bharatiya Parishad, Telangana Prant

గవర్నర్ సిద్దిపేట కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు వస్తున్నట్లుగా ఆదివారం ప్రకటించిన షెడ్యూల్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు 22 : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు సంబంధించి సిద్దిపేట జిల్లా పర్యటన చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలో జరగనున్న ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను నేడు ఆయన ప్రారంభించనున్నారు. తొలిసారిగా జిల్లాకు వస్తున్న క్రమంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైం ది. అయితే సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గవర్నర్ పర్యటన తారుమారైంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు రాజ్‌భవన్ నుంచి బయలుదేరి 11.15 గంటలకు రంగనాయకసాగర్ గెస్ట్‌హౌజ్‌కు చేరుకుంటారని శనివారం అధికారికంగా షెడ్యూల్ విడుదల చేశా రు. తన కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యా హ్నం ఒంటి గంటకు రంగనాయకసాగర్ వద్ద బయల్దేరి రాజ్‌భవన్ చేరుకుంటారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. కానీ ఆయన కార్యక్రమం ఇందుకు విరుద్ధంగా మారింది. దీనికి సంబంధించి ఆదివారం మరో పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. సోమవారం ఉద యం 9.30 గంటలకు రాజ్‌భవన్ వద్ద బయల్దేరి 11.10 గంటలకు కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రథమ పౌరుడిగా భావించే గవర్నర్ పర్యటన విషయంలో రెండేసి షెడ్యూళ్లు విడుదల చేయడం చర్చనీయాంశమైంది.

మద్యం పార్టీనే కారణమా..

రంగనాయకసాగర్‌కు బదులు జిల్లా కలెక్టరేట్‌కు గవర్నర్ రాకను మార్చడం వెనుక ఓ ప్రైవేట్ ఫంక్షన్‌కు సంబంధించిన మద్యం పార్టీనే కారణమా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రంగనాయకసాగర్ గెస్ట్‌హౌజ్‌ను ప్రస్తుతం పర్యాటకశాఖ పర్యవేక్షిస్తోంది. ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణకు అద్దెకు ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఓ ఫంక్షన్‌కు సంబంధించి మద్యంతో కూడిన విందు కార్యక్రమం జరిగింది. దీనిని రద్దు చేసుకునే పరిస్థితి లేకపోవడంతో రాత్రి వరకు కొనసాగింది. గవర్నర్ పర్యటన ఖరారు కాకముందే ఈ విందుకు అనుమతి ఇవ్వడంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. ముందస్తుగా విచారణ చేయకపోవడం వల్ల షెడ్యూల్‌లో నమోదు చేసి ఆ తర్వాత తొలగించారు. రంగనాయకసాగర్‌కు బదులు కలెక్టరేట్‌ను ఖరారు చేశారు. దీంతో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న గవర్నర్ పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లు తలెత్తాయి. దీనిపై అధికార యంత్రాంగం సరైన దృష్టి సారించకపోవడం వల్లనే పర్యటన తారుమారు అయినట్లుగా అవగతమవుతోంది. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా.. రంగనాయకసాగర్ గెస్ట్‌హౌజ్‌లో లిఫ్ట్ పనిచేయడం లేదని అందుకే షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు చెప్పారు.



రంగనాయకసాగర్ గెస్ట్‌హౌజ్‌లో నిన్న జరిగిన మద్యం విందు



ప్రథమ ర్యాంకు సాధించిన సౌమ్యకు ప్రశంసాపత్రం అందజేసి అభినందిస్తున్న గణితఫోరం రాష్ట్ర కమిటీ

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన జక్కాపూర్ విద్యార్థిని

● గణితఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రథమస్థానం

సిద్దిపేటరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్టులో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ విద్యార్థిని ఈర్ల సౌమ్య రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ తెలిపారు. గణిత శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో 33 జిల్లాల నుంచి 99 మంది విద్యార్థులు టాలెంట్ టెస్టుకు హాజరవ్వగా జక్కాపూర్ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో సత్తాచాటి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిందని షౌకత్ అలీ పేర్కొన్నారు. విద్యార్థిని సౌమ్యను పాఠశాల అధ్యాపక బృందం అభినందించింది.

డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు



బేకరీలో డాగ్‌స్క్వాడ్‌తో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయపోల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, ఇతర ఎలాంటి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం రాయపోల్ మండల కేంద్రంలో నార్కోటిక్స్ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో పలు దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు కలిగి ఉన్న చాక్లెట్లు విక్రయించవద్దని పేర్కొన్నారు. వారి వెంట ఏఎస్ఐ దేవయ్య, సిబ్బంది ఉన్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

- ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలే టార్గెట్
- 90 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు
- స్టడీ అవర్స్‌లో స్పెషల్ కేర్
- మానసిక ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక తరగతులు



విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది ఇంటర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా 25వ స్థానంలో నిలిచింది. ఈ సారి అత్యధిక ఉత్తీర్ణత శాతంతో మంచి మెరుగైన స్థానం సంపాదించాలని జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు. ప్రత్యేక తరగతులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో స్పెషల్ క్లాస్‌లు ఏర్పాటుచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 55 ప్రభుత్వ అనుబంధ కళాశాలలు, 23 ప్రైవేట్ కాలేజీలున్నాయి. వీటిలో 20,600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

యాక్షన్ ప్లాన్ అమలు

బెస్ట్ రిజల్టే టార్గెట్‌గా ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కళాశాల విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. డిసెంబరు 1 నుంచి మొదలైన యాక్షన్ ప్లాన్‌ను జిల్లాలోని పలు కళాశాలల్లో ఇప్పటికే అమలు చేస్తున్నారు. నిర్దేశించిన తేదీ వరకు సిలబస్ పూర్తయ్యేలా చూడటంతో పాటుగా, ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇంగ్లిష్ ప్రాక్టికల్ కోసం స్పెషల్ కేర్ తీసుకుంటున్నారు. కాలేజ్ టైమింగ్స్‌తో పాటుగా ఉదయం, సాయంత్రం అదనంగా స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నారు. క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం (పేరెంట్స్-టీచర్స్ మీటింగ్) ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే రోజులు కీలకం కాబట్టి హాజరుశాతంపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

4 గ్రేడ్‌లుగా విద్యార్థులు

ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కళాశాలలో చదివే స్టూడెంట్స్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా కళాశాల అంతర్గత పరీక్షల ఆధారంగా 70 శాతం మార్కుల కంటే ఎక్కువ వచ్చిన వాళ్లను ఏ గ్రేడ్‌గా ఎంపిక చేస్తారు. 50 నుంచి 70 శాతం స్కోర్ చేసిన వారిని బి గ్రేడ్‌గా పరిగణిస్తారు. 35 నుంచి 50 శాతం మార్కులు వచ్చిన వారిని సి గ్రేడ్‌గా చూస్తారు. ఇక 35 కంటే తక్కువ వచ్చిన వారిని డి గ్రేడ్‌గా గుర్తిస్తారు. ఇలా తక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యేక తరగతులు

విద్యార్థులు వివిధ కారణాలతో మానసిక ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యల వరకు వెళ్తున్నారు. అలాంటి ఆలోచన నుంచి బయటపడేయడానికి, బాగా చదివేందుకు అవసరమైన సలహాల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ కళాశాలకు ప్రత్యేకంగా హైదరాబాద్ "ఎంసీహెచ్‌ఆర్‌డీ"లో శిక్షణ పొందిన ఇద్దరు స్టూడెంట్ కౌన్సిలర్లను ఏర్పాటు చేశారు. వివిధ అంశాలపైన వీరు ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు మానసిక ఆందోళనకు లోనైనప్పుడు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి టెలిమానస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఏ సమయంలోనైనా 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమస్య చెప్పి పరిష్కారం పొందవచ్చు. ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కొనసాగే ఈ నంబర్ ద్వారా నిపుణులైన మానసిక వైద్యులు సలహాలు అందిస్తారు. విద్యార్థులే కాకుండా తల్లిదండ్రులు కూడా విద్యార్థుల సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లొచ్చు. వారు విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి అవసరమైన పరిష్కారాన్ని చూపిస్తారు. యాంటి డ్రగ్స్

మిగతా 8వ పేజీలో...



కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తుల రద్దీ


కొమురవెల్లి, వర్గల్‌లో భక్తుల రద్దీ

చేర్యాల/వర్గల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించారు. అభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, బండారి సమర్పించారు. మల్లన్న సహోదరి ఎల్లమ్మ తల్లికి బోనం నివేదించి కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యం సమర్పించి చల్లగా కాపాడమని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు. రెండో యాదాద్రిగా పేరొందిన వర్గల్ మండలం నాచారం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.



నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు







రెంజర్ల రాజేశ్, దిగంబర కాంబ్లే ముందస్తు అరెస్టు


తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో రాజేశ్, దిగంబర కాంబ్లే

తూప్రాన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నాయకుడు, సమతా సైనిక్‌దళ్ ప్రధాన కార్యదర్శిని తూప్రాన్ పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. కేంద్రమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసన ప్రదర్శన చేపట్టడానికి రెంజర్ల రాజేశ్ మాల, మాదిగ మేధావుల నిరసనకు పిలుపునిచ్చారు. నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న రెంజర్ల రాజేశ్, దిగంబర కాంబ్లేలను ఆదివారం ఉదయం 7.30 గంటలకు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి, సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రెంజర్ల రాజేశ్ మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మొదటి అంతస్తు నుంచి జారిపడి..

మైనార్టీ గురుకుల విద్యార్థిని మృతి


సాధీయమెహరూన్ (ఫైల్)

జహీరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మొదటి అంతస్తు రేలింగ్‌ను పట్టుకున్న విద్యార్థి జారిపడి బలమైన గాయాలు కావడంతో మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం బూచనెల్లి గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్నది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని జమాల్ కాలనీకి చెందిన ఆసిఫ్ కూతురు సాధీయమెహరూన్(14) బూచనెల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో గురుకుల పాఠశాల భవనంలోని మొదటి అంతస్థులో మెట్ల పక్కన అమర్చిన రేలింగ్‌ను పట్టుకుని వెళుతున్న క్రమంలో అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో బాలిక తలకు తీవ్రగాయాలు కాగా, పక్కనే ఉన్న విద్యార్థులు పాఠశాలలోని ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే 108 అంబులెన్స్‌లో జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. బాలిక మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలిక తండ్రి ఆసిఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరించారు. సంఘటనా స్థలానికి జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం చేరుకుని బాలిక మృతిపై తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి

పాఠశాలలో పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే సాధీయామెహరూన్ మృతిచెందిందని కుటుంబీకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. పాఠశాలలో 400పైచిలుకు విద్యార్థులుండగా కొంతమంది ఉపాధ్యాయులను కేటాయిస్తే ఇలా జరిగి ఉండేది కాదన్నారు. గురుకుల పాఠశాలల నిర్వహణపై అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఆస్తి విషయమై ఘర్షణ..

తమ్ముడిని హత్య చేసిన అన్న


సందీప్‌గౌడ్ (ఫైల్)

దుండిగల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య ఆస్తి విషయమై జరుగుతున్న ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, కౌడుపల్లి మండలం, రాయిలాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ గౌడ్, సందీప్‌గౌడ్(27) అన్నదమ్ములు. సంతోష్‌గౌడ్ బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చాడు. కుత్బుల్లాపూర్‌లో నివసిస్తూ పేట్‌బషీరాబాద్‌లో ఆర్టీఏ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సందీప్ గౌడ్ రాయిలాపూర్‌లోనే ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. ఇతడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఆస్తి విషయంలో తరచూ అన్న సంతోష్‌గౌడ్‌తో గొడవపడేవాడు. తమ్ముడితో తనకు ఇబ్బంది తప్పదని భావించిన అన్న సంతోష్ మాట్లాడుకుందామని తెలిసిన వ్యక్తి ద్వారా సోదరుడిని రప్పించాడు. అప్పటికే సందీప్‌గౌడ్ మద్యం తాగాడు. మత్తులో అక్కడికి చేరుకున్న సందీప్ తలపై సంతోష్ సుత్తితో మోదీ హత్య చేశాడు. అనంతరం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తన తమ్ముడి ఆగడాలు మితిమీరడంతోనే హత్య చేశానని పోలీసులకు చెప్పాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

- 76 గ్రాములు స్వాధీనం


నిందితులను చూపుతున్న ఎస్ఐ దామోదర్

మర్కుక్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండలంలోని కర్కపట్ల గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్కపట్ల గ్రామంలో ఇద్దరు కలిసి గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి నిఘా పెట్టారు. గిరిమిల్ల సాయి మధు(19), సారా మహేష్(19) ఇద్దరూ గంజాయి సేవిస్తూ, విక్రయిస్తుండగా ఎస్ఐ దామోదర్ వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 76 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ కృష్ణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు

కృష్ణాపూర్ విద్యార్థినుల ఎంపిక


రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

కల్హేర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున ఆడేందుకు మండల పరిధిలోని కృష్ణాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుధాకర్ ఆదివారం తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో ఎంపిక పోటీలను నిర్వహించగా ప్రతిభచాటిన కృష్ణాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జె.వర్ష, జి.సంయుక్త, ఆర్.సోనా, కె.శ్రీలత, డి.పూజ ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. జనవరి 8వ తేది నుంచి 11 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి 57వ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను, పాఠశాల పీఈటీ రాములు యాదవ్‌ను హెచ్ఎం, సిబ్బంది అభినందించారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో

మెదక్ విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో బెల్టులు సాధించిన విద్యార్థులు

మెదక్ అర్బన్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం మేడ్చల్‌లో డైనమిక్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన 1000 మంది హాజరయ్యారు. పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థులు అఖిల్, మనివర్ధన్, స్వరూప్ బ్లాక్ బెల్ట్ టీం కట విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ నగేష్, కోచ్ దినకర్ తెలిపారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



అశ్విని మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి

బెజ్జంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరకట్న వేధింపులను భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల పకారం... గ్రామానికి చెందిన వడ్లకొండ శ్రీకాంత్‌తో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన అశ్విని(27)తో 2020లో వివాహమైంది. వివాహ సమయంలో అశ్విని తల్లిదండ్రులు రూ.8 లక్షల నగదుతో పాటు, 13 తులాల బంగారాన్ని వరకట్నంగా ఇచ్చారు. పెళ్లి అయినప్పటి నుంచి శ్రీకాంత్ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. రోజు వారి ఖర్చుల కోసం అశ్వినిని తన తల్లి గారి ఇంటి వద్ద నుంచి డబ్బు తేవాలని వేధించేవాడు. ఈ క్రమంలో వేధింపులు భరించలేక అశ్విని ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. వారికి కుమారుడు శ్రేయన్స్(3) ఉన్నాడు. అశ్విని తండ్రి కెక్కుర్ల చంద్రయ్య ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌తో పాటు, అతడి కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

మద్యం తాగొద్దని.. భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య

నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ మృతి



పరశురాములు (ఫైల్)

కుకునూరుపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని భార్య మందలించడంతో భర్త ఆత్మహత్యకు పాల్పడగా నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మంగోల్ గ్రామానికి చెందిన మీసా పరశురాములు గొర్రెల కాపరి కాగా జీవనం సాగిస్తున్నాడు. పరశురాములు కొన్నేళ్లుగా మద్యానికి బానిసగా మారి తనకు ఉన్న గొర్రెలను అమ్ముకుంటూ మద్యం తాగేవాడు. దీంతో భార్య గొర్రెలను అమ్మి మద్యం తాగొద్దని బుధవారం భర్తను మందలించింది. దీంతో భర్త పరశురాములు రాత్రి 10 గంటల సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారి సహాయంతో ప్రైవేటు వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం కుదుటపడడంతో శుక్రవారం ఇంటికి వచ్చారు. శనివారం పరశురాములుకు కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం సాయంత్రం చికిత్స పొందుతూ పరశురాములు మృతి చెందాడు. పరశురాములుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా కుమార్తెల వివాహమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి



బుచ్చవ్వ (ఫైల్)

గజ్వేల్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిన ఘటన గజ్వేల్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకున్నది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన చామంతి బుచ్చవ్వ(60) అనారోగ్యంతో గజ్వేల్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకొని నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద దుబ్బాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గజ్వేల్ నుంచి దుబ్బాకకు వెళ్లే క్రమంలో బచ్చవ్వను ఢీకొన్నది. ఆమె బస్ కింద పడి కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బుచ్చవ్వను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. బుచ్చవ్వ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆల్ప్రాజోలం కలిపి విక్రయిస్తున్న కల్లు పట్టివేత

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి సమీపంలోని ఓ కల్లు దుకాణంలో ఆల్ప్రాజోలం కలిపి కల్లు విక్రయిస్తుండగా ఒకరిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. కల్లు దుకాణ యజమాని ఆల్ప్రాజోలం కలిపి కల్లు అమ్ముతున్నాడు అన్న నమ్మదగిన సమాచారంతో వెళ్లి తనిఖీ చేయగా నిజమే అని తేలడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.



కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పంట

సేంద్రియ సాగుకు కృషి

ఆధునిక వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులే లక్ష్యం

- పరిశోధన.. సాంకేతిక పద్ధతులకు పెద్దపీట
- రైతులకు శిక్షణనిస్తున్న కేవీకే
- 25న కేంద్రానికి ఉపరాష్ట్రపతి, గవర్నర్ రాక
- 800 మంది రైతులతో సమావేశం

నర్సాపూర్, కౌడిపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులను సేంద్రియ ఎరువుల వైపు దృష్టి సారించేలా కృషి చేయడంతో పాటు... తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణనిస్తూ.. కొత్తకొత్త పరిశోధనలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) పనిచేస్తోంది. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని కౌడిపల్లి మండలం పరిధి తుంకి సమీపంలో జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆర్థిక సహాయంతో 2018లో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ వ్యవసాయ సాంకేతిక, పరిశోధన సంస్థ పరిధిలో ఈ కేంద్రం కొనసాగుతుంది.

30 ఎకరాల్లో పంటలు

తుంకి సమీపంలోని దివంగత సినీ నిర్మాత డాక్టర్ రామనాయుడుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో కృషి విజ్ఞాన కేంద్రం 30 ఎకరాల్లో కొనసాగుతున్నది. కేవీకేలో ఒక సీనియర్ శాస్త్రవేత్తతో పాటు ఐదుగురు శాస్త్రవేత్తలు ఉన్నారు.



కేవీకేలో తయారు చేసిన అలవేర సబ్బులు

వారు సేద్య, వ్యవసాయ విస్తరణ, యాంత్రీకరణ, గృహ విజ్ఞాన, ఉద్యానవన విభాగాలు, పంటల రక్షణ, అనుబంధ రంగాల అవసరాలను తీర్చడంతో పాటు రైతులకు అవగాహన కల్పిస్తూ వివిధ పంటలను సేంద్రియ పద్ధతుల్లో పండించేందుకు ప్రోత్సహిస్తున్నారు. కొత్త కొత్త సాంకేతిక, ఆధునిక పద్ధతులు అమలు చేస్తూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పెట్టుబడి రావడమే ధ్యేయంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తుంటారు. ఇక్కడ బొప్పాడి, మామిడి, జామతో పాటు వివిధ రకాల కూరగాయలను సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి వచ్చేలా సాగు చేస్తుంటారు. శాస్త్రవేత్తలు ఓ వైపు ఇక్కడ పనిచేస్తూనే.. జిల్లాలోని గ్రామాలకు, రైతుల పొలాల వద్దకు వెళ్లి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తుంటారు.

సేంద్రియ ఎరువుల తయారీ.. భూసార పరీక్షలు

కేంద్రంలో వేస్టు డీకంపోజర్, అజోల్లా, వర్మి కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు అందచేస్తారు. కేంద్రంలో ఉన్న జీవనియంత్రణ ప్రయోగశాలలో చేస్తున్న పీఎస్‌బీ, ఎన్‌పీకే, జేఎన్ మిశ్రమ, రైజోబియం జీవన ఎరువులు, ట్రైకోడర్మ, సుడోమోనాస్, బవేరియా, వంటివి శిలింధ్ర, కీటక నాశినిలను కూడా రైతులకు అందించి భూసారాన్ని పెంచేందుకు తోడ్పడుతారు. మెదక్ జిల్లాలో ఆయా ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలను నిర్వహిస్తారు. మట్టి ఆధారంగా ఎక్కడ ఏ పంట వేయాలో రైతులకు సూచిస్తారు. ఉద్యానవన రైతులకు నాణ్యమైన మొక్కలను సరఫరా చేయడానికి కేంద్రంలో ప్రత్యేకంగా విత్తనాలు పెంచే నర్సరీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో వంకాయ, జామ, నిమ్మజాతి మొక్కలు ఉత్పత్తి చేసి రైతులకు అందచేస్తారు.

కలబందతో సబ్బుల తయారీ

కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ ఎరువులతో పండించే కలబందను ఉపయోగించి సబ్బులను తయారు చేయడమే కాకుండా వీటిని ఎలా తయారు చేస్తారో రైతులకు శిక్షణ ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా కృషి చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ మిషన్

కృషి విజ్ఞాన కేంద్రం మెదక్ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వివిధ శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తుంది. ఔట్ స్కేలింగ్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం ద్వారా మహిళ రైతులకు, గ్రామీణ యువతకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తుంది.

ఉపరాష్ట్రపతి, గవర్నర్ రాక

25వ తేదిన కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సందర్శించనున్నారు. కేంద్రంలో సేంద్రియ ఎరువులతో పండిస్తున్న పంటలతో పాటు ఉత్పత్తులను పరిశీలించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇదివరకే ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొంది తమ పొలంలో సేంద్రియ ఎరువులతో వ్యవసాయ చేస్తున్న 800 మంది రైతులతో సమావేశమై, వారి అనుభవాలు తెలుసుకోనున్నారు.



తుంకిలోని కృషి విజ్ఞాన కేంద్రం

సేంద్రియ సాగుపై రైతుల ఆసక్తి



రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడిప్పుడే రైతులు పూర్తిస్థాయిలో సేంద్రియ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఆధునిక పద్ధతులను వివరిస్తూ శిక్షణ ఇస్తున్నాం. కేవీకేకు ఉపరాష్ట్రపతి, గవర్నర్ వస్తుండటం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశంలోనూ ఈ కేంద్రానికి గుర్తింపు రావడం ఆనందంగా సంతోషంగా ఉంది.

\- డాక్టర్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్, కేవీకే సీనియర్ సైంటిస్టు

ఎవరి సొత్తూ అక్కర్లేదు.. మా వాటా మాక్కావాలి

- రేవంత్‌రెడ్డి సర్కార్ మాట నిలబెట్టుకోవాలి
- ఫిబ్రవరి 3న 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు'
- లక్షలాదిగా తరలి..మాదిగల సత్తా చాటాలి
- దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్లె సంజీవయ్య, రాష్ట్ర కో ఆర్డినేటర్ డప్పోల్ల రమేశ్ పిలుపు

పుల్‌కల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'ఎవరి సొత్తు అక్కర్లేదని, మా వాటా మాక్కావాలి' అని దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య, కార్యక్రమ రాష్ట్ర కో ఆర్డినేటర్, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి డప్పోల్ల రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి3న హైదరాబాద్‌లో తలపెట్టిన 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు' మహా ప్రదర్శన సన్నాహక సమావేశం చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఆదివారం జై భారత్ రాష్ట్ర కన్వీనర్ కాశపాగ ఇమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగానే ఉన్నారని, వారిని అనవసరంగా విడగొడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారం ఒట్టి బూటకమని ఖండించారు. గ్రామాల్లో బావులు, బస్తీలు వేర్వేరుగానే ఉన్నాయని, ఏనాడు కలసి లేరని.. మాల, మాదిగలకు కంచం పొత్తు.. మంచం పొత్తు లేదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల



డప్పు ప్రదర్శననిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గడుస్తున్నప్పటికీ, రిజర్వేషన్లు అందని కులాలు నేటికి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అందరికీ సమన్యాయం చేసి, సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ముప్పై ఏళ్ల దండోరా పోరాటం ఫలితంగా ఆగస్టు 1న దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు సంబంధించి చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. వర్గీకరణ లేకుండా జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రస్థాయిలో నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా ప్రతీ గ్రామం నుంచి సంకన డప్పు వేసుకుని మాదిగల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై డప్పులతో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమార్పీఎస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు, ఏర్పుల కృష్ణ, మాదిగ, నాగులపల్లి శ్రీహరి, రచయితలు సొన్నాయిల బాలరాజు, అమృత్ బండారి, కోఫూరి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఆకుకూరల సాగుతో మంచి ఆదాయం

ఆకుకూరలు, కూరగాయలను సాగు చేయడంతో మంచి ఆదాయం పొందుతున్నాం. మాకున్న కొద్ది మేర భూమిని భాగాలుగా చేసి కొన్నేళ్ల నుంచి ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. వర్షా కాలం, వేసవి కాలానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం వివిధ పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పుడు వంగ, బెండ, గోరుచిక్కుడుకాయ, ఆకుకూరలు సాగు చేస్తున్నాం. ఆకుకూరల సాగు మొత్తం నేనే చూసుకుంటాను. గుంటలో పాలకూర సాగుకు పూర్తయ్యే నాటికి రూ. 1500 ఖర్చు అయితే రూ.10 వేల ఆదాయం పొందుతున్నాం.

\- గడ్డం స్వరూప నాగిరెడ్డిగూడెం

సాగుబాటలో వనితలు

- ఆకుకూరలతో లాభాలు
- ఆదర్శంగా నిలుస్తున్న నాగిరెడ్డి గూడెం మహిళలు

గుమ్మడిదల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అదో చిన్న గ్రామం.. అందరూ వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తుంటారు. ఆ ఊరు మహిళలు తమ కుటుంబానికి చేదోడుగా ఉండేందుకు ఉన్న కొద్ది స్థలంలోనే ఆకుకూరలను సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. భూములు ఉన్నవారు పంట సాగు చేస్తే.. లేనివాళ్లు పట్టణంలోని మార్కెట్‌లలో విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఇలా గుమ్మడిదల మండలం పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు.

నాగిరెడ్డిగూడెం గ్రామంలో ప్రధానంగా వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. మగవారు మొక్కజొన్న, పత్తి, వరి పంటలు సాగు చేస్తుండగా.. వారి ఇంట్లోని ఆడవాళ్లు సైతం కుటుంబానికి ఆసరాగా నిలవాలనే సాగుబాట పట్టారు. గ్రామంలోని దాదాపు 20 మందికిపైగా మహిళలు కొన్నేళ్లుగా తమకు ఉన్న కొన్ని గుంటల భూమిలోనే.. అందుబాటులో ఉన్న నీటి వసతితో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ప్రణాళిక ప్రకారం తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో సాగు చేస్తూ రోజూ ఆకుకూరలు సమీపంలో ఉన్న మార్కెట్‌కు వెళ్లి విక్రయించి మంచి లాభాలు గడిస్తున్నారు. గుంటల భూమిలో భాగాలు చేసి పాలకూర కొత్తిమీర, పుదీనా, గొంగూర, మెంతి, ఇతర కూరగాయలు వేస్తున్నారు. ఈ ఆకుకూరలతో వచ్చే ఆదాయంతో ఇంటి ఖర్చులు వెల్లదీస్తూ కుటుంబానికి ఆసరా అవుతున్నారు.



గుమ్మడిదల సంతలో ఆకుకూరలను విక్రయిస్తున్న మహిళ

పదేళ్లుగా సాగు చేస్తున్నాం

పదేళ్లుగా ఆకుకూరల పంటలు సాగు చేస్తున్నాం. మంచి ఆదాయం వస్తుంది. వచ్చిన పంట ఆదాయంతోనే పిల్లల చదువులకు ఖర్చు పెడుతూ, కుటుంబ పోషణకు వినియోగించుకుంటున్నాం. ఈ ఏడాదిలో పాలకూర, మిర్చి ఇతర కూరగాయ పంటలు సాగు చేస్తున్నా. మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయలు సాగు చేయడంతో అధిక లాభాలు పొందుతున్నా.

\- మేకల భాగ్యమ్మ, నాగిరెడ్డి గూడెం గ్రామం





నారాయణఖేడ్ మండలం చాంద్‌ఖాన్‌పల్లిలో సాగవుతున్న క్యాబేజీ పంట

ఖేడ్ మార్కెట్.. కూరగాయలకు కేరాఫ్

- మూడు రాష్ట్రాల నుంచి ఇక్కడికి కూరగాయల దిగుమతి
- ఎక్కడ వివాహాది శుభకార్యాలు జరిగినా ఖేడ్ నుంచే కొనుగోలు

నారాయణఖేడ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న నారాయణఖేడ్ తాజా కూరగాయలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఖేడ్ మార్కెట్‌కు మూడు రాష్ట్రాల నుంచి ప్రతీ రోజు కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ఎక్కడా వివాహాది శుభకార్యాలు జరిగిన తాజా కూరగాయల కోసం నారాయణఖేడ్ మార్కెట్‌కు రావాల్సిందే. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో కూరగాయలను విరివిగా సాగు చేస్తారు. వ్యాపారులు స్థానికంగా లభించే కూరగాయలకు తోడు కర్ణాటక, మహారాష్ట్ర నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి రోజు దిగుమతి చేస్తారు. సీజనల్‌గా లభించే అన్ని కూరగాయలను అందుబాటులో ఉంచుతారు. రోజూ ఉదయం 4 గంటల వరకు కూరగాయలు నారాయణఖేడ్ మార్కెట్‌కు చేరుకుంటాయి. తెల్లవారు జామున 6 గంటల వరకు మార్కెట్‌లో కూరగాయల బీట్లు పూర్తి అవుతాయి. అనంతరం చిల్లర వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తారు. టమాటాలను అనంతపూర్ జిల్లా మదనపల్లి నుంచి దిగుమతి చేస్తుంటారు. వంకాయలు మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి, ఆలు, అల్లం, వెల్లుల్లి, సొరకాయలు, గుమ్మడికాయలు, క్యాప్సికం, దొండకాయలు, హైదరాబాద్ నుంచి తీసుకువస్తారు. ఉల్లిపాయలు సీజనల్‌లో స్థానికంగా అందుబాటులో ఉన్నప్పటికీ, లేని సమయంలో మహారాష్ట్ర నుంచి దిగుమతి చేస్తారు. ప్రతి మంగళవారం నారాయణఖేడ్‌లో వారాంతపు సంత నిర్వహిస్తారు. ఖేడ్ నుంచి వంద కిలో మీటర్ల వరకు ఎక్కడ శుభ కార్యాలు జరిగినా ఇక్కడి నుంచే తీసుకువెళ్తారు.



ఖేడ్ మార్కెట్‌లో సందడి

అందుబాటులో కూరగాయలు



వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మూడు రాష్ట్రాల నుంచి కూరగాయలను తీసుకువచ్చి అందుబాటులో ఉంచుతాం. మహారాష్ట్రలోని షోలాపూర్, దెగ్లూర్, కర్ణాటకలోని బీదర్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి విక్రయిస్తాం. ఇతర ప్రాంతాల నుంచి వినియోగదారులు వచ్చి కొనుగోలు చేస్తారు.

\- యూసుఫ్, కూరగాయల వ్యాపారి

తాజా కూరగాయలు లభిస్తాయి



నారాయణఖేడ్ మార్కెట్‌లో ప్రతీ రోజు తాజా కూరగాయలు లభిస్తాయి. కూరగాయలను ఏరోజుకు, ఆ రోజు కొనుగోలు చేస్తాం. ఏడాది పాటు మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. అందువల్ల ఖేడ్‌లో కూరగాయల కొనుగోలుకు ఆసక్తి చూపుతాం.

\- బస్వరాజ్, కొనుగోలుదారుడు

నేడు కొమురవెల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలకేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ జె.మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొమురవెల్లి, కిష్టంపేట, గౌరాయపల్లి, రాంసాగర్, ఐనాపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

మల్లన్న కల్యాణం ఏర్పాట్లపై నిర్లక్ష్యం తగదు

చేర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న కల్యాణ ఏర్పాట్లపై ఆలయాధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒగ్గు రాజు పేర్కొన్నారు. కొమురవెల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ శైవక్షేత్రంతో పాటు జిల్లాలోని ఏకైక ప్రతిష్ఠాత్మక మల్లన్న ఆలయంలో జరిగే కల్యాణానికి భక్తులు భారీగా తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లు ప్రారంభించకపోవడం సరికాదన్నారు. అధికారులకు భక్తుల నుంచి వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ వసతుల కల్పనపై లేకపోవడం శోచనీయమన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మిరుదొడ్డి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం అక్బర్‌పేటలో ఆయన మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పనికి తగిన వేతనాన్ని చెల్లించాలని కోరారు. సమగ్రశిక్షా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

వైద్యం కోసం ఎల్‌వోసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్ గౌడ్

దూళిమిట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన చెన్నోజు మమత అనారోగ్యంతో బాధపడుతుండగా, వైద్యానికి పెద్దమొత్తంలో డబ్బు అవసరమైంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా సీఎంఆర్ఎఫ్ కింద రూ.1.75 లక్షలు మంజూరయ్యాయి. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని స్థానిక నాయకులతో కలిసి నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అందజేశారు.

బాధితురాలికి ఆర్థిక సహాయం

గజ్వేల్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన సూర్యకళ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకొని ఆదివారం మనం ఫౌండేషన్ సభ్యులు బాధితురాలిని పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గొడుగుస్వామి, కోశాధికారి అంజనేయులు, సభ్యులు సత్యనారాయణచారి, మల్లికార్జున్, రాజుగౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే 'పల్లా' సంతాపం

చేర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండల మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి పితృవియోగం చెందారు. మండలంలోని చుంచనకోట గ్రామానికి చెందిన అతడి తండ్రి తాండ్ర దామోదర్‌రెడ్డి(68) ఆదివారం హఠాన్మరణం చెందడం పట్ల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. మృతదేహంపై పూలమాల వేసి, కుటుంబసభ్యులను ఓదార్చారు. అంతకుముందు మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ శ్రీను నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా

అంబులెన్స్ లేక అందని అత్యవసర సేవలు

- దూళిమిట్ట మండలంగా ఏర్పడి ఏళ్లు గడిచినా 108 వాహనం లేక అవస్థలు
- అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలే దిక్కు



దూళిమిట్ట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అనుకోని ప్రమాదాలకు గురైనవారిని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను స్థానిక ఆరోగ్య కేంద్రాలు లేదా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు తరలించడానికి 108 అంబులెన్స్ సౌకర్యం లేక దూళిమిట్ట మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ప్రతీ మండలానికి ఒక అంబులెన్స్ సౌకర్యం ప్రభుత్వం ఉచితంగానే కల్పిస్తుంది., దూళిమిట్ట మండలం ఏర్పడి కొన్నేళ్లు గడిచినా ఇంతవరకు అంబులెన్స్‌ను కేటాయించకపోవడంతో అత్యవసర వైద్యం కోసం మండల ప్రజల అవస్థలు అంతా ఇంతా కాదు.

మండలంలో పరిస్థితి ఇలా..

ధూళిమిట్ట మండలంలో దాదాపు 11 గ్రామాలు ఉన్నాయి. ఇందులో 3 గ్రామ పంచాయతీలు తండా గ్రామ పంచాయతీలే ఆయా గ్రామాల పరిధిలో ముఖ్యంగా గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న కొండాపూర్,హనుమతండా, సిబ్బితండా గ్రామాల పరిధిలో ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించాలంటే పక్క మండలాల నుంచి అంబులెన్స్ వచ్చేవరకు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నదని మండల ప్రజలు వాపోతున్నారు. ఒక్కోసారి పక్క మండలంలో కూడా అంబులెన్స్ అందుబాటులో లేనప్పుడు అత్యవసర వైద్యం అందాల్సిన బాధితుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న తరుణంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చివరకు ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ధూళిమిట్ట మండలానికి నూతన అంబులెన్స్‌ను కేటాయించాలని కోరుతున్నారు.

మండలానికి తక్షణమే అంబులెన్స్ కేటాయించాలి

ధూళిమిట్ట మండలానికి ప్రభుత్వం అంబులెన్స్ కేటాయిస్తే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను, క్షతగాత్రులను త్వరగా ఆసుపత్రులకు తీసుకువెళ్లేందుకు అవకాశం ఉంటుంది.. తద్వారా బాధితుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. రవాణా సౌకర్యం సరిగా లేని మా తండాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. అంబులెన్స్ లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను సమకూర్చుకునేలోపు విలువైన సమయం వృథా అవుతుంది. అధికారులు వెంటనే అంబులెన్స్‌ను కేటాయించాలి.

- చిరంజీవి, కొండాపూర్ గ్రామస్థుడు

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మిరుదొడ్డిలో జెండా ఊపి టూకే రన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మిరుదొడ్డి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసలై.. తమ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలకేంద్రమైన మిరుదొడ్డిలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ టూకే రన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేటి యువత డ్రగ్స్ గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలై విలువైన జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లోని యువతకు మత్తుపదార్థాలపై అవగాహన కల్పించడానికే రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు.

అనంతరం టూకే రన్‌లో గెలుపొందిన యువకులకు మోడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, రన్‌ఫర్ యాంటీడ్రగ్స్ ఆర్గనైజర్ తోటకమలాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

చేర్యాలలో ఘనంగా పెన్షనర్స్ డే



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

చేర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పెన్షనర్స్ డేను మంగళవారం చేర్యాల మండలకేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వికాస్ గ్రామర్‌స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీటీవో బాలరాజు, జిల్లాశాఖ ప్రధానకార్యదర్శి ఎ.రాజిరెడ్డి, సంఘం అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి ఘన నివాళి



కాకా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మాజీ మంత్రి దివంగత వెంకటస్వామి (కాకా) వర్ధంతి సందర్భంగా ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు చిత్తారి రవీందర్, కొడముంజ మహేందర్, ఎండీ హసన్, శ్రీనివాస్, కిష్టస్వామి, సరోజన, వెన్న రాజు, బిక్యా తదితరులున్నారు.



కొమురవెల్లిలో పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు

కొమురవెల్లిలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

చేర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండల కేంద్రంలో ఆదివారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. మల్లన్న ఆలయ పరిసరాల గుండా గ్రామవీధుల్లో కవాతు కొనసాగింది. అనంతరం చేర్యాల సీఐ ఎల్. శ్రీను మాట్లాడుతూ సెన్సాప్ సెక్యూరిటీలో భాగంగా శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడినప్పుడు జిల్లా పోలీసులకు సహాయ సహకారాలనిస్తూ ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ బలగాలు వెంటనే రంగంలోకి దిగుతాయన్నారు. ప్రజల్లో శాంతిభద్రతలపై భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు. కవాతులో ఎస్ఐ రాజు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, ఇన్‌స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీరన్నపేటలో సీపీఐ సభ్యత్వ నమోదు

చేర్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వెంట నాయకులు ఈరు భూమయ్య, పొన్నబోయిన మహేందర్, సిద్దిరాం భద్రయ్య, చిగుల్ల నరేశ్, జూకంటి చంద్రం తదితరులు ఉన్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కాంపెయిన్స్ చేపట్టి మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే వాటిల్లే నష్టాలను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ముందుకెళ్తూ ఇంటర్ ఫలితాల్లో మెరుగైన స్థానంలో జిల్లాను నిలబెట్టాలని అధికారులు పనిచేస్తున్నారు.

మంచి ఫలితాలు సాధిద్దాం

- రవీందర్‌రెడ్డి, డీఐఈవో



ఇంటర్మీడియట్‌లో గతేడాది మెరుగైన ఫలితాల కోసం అందరం కలిసి మనస్ఫూర్తిగా పనిచేస్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. 90 రోజుల ప్రణాళికలో మరో 60 రోజులు మాత్రమే ఉంది. మరింత ప్రణాళికబద్ధంగా అందరూ సమిష్టిగా పనిచేయాల్సిన అవసరముంది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. మంచి ప్రతిభ చూపిస్తున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించాలి. అధ్యాపకులు, తల్లిదండ్రులు తరుచుగా విద్యార్థులతో మాట్లాడుతూ వారిని పరీక్షకు సన్నద్ధం చేయాలి.

మానసిక ఆందోళనకు గురికావొద్దు



- కనకచంద్రం, స్టూడెంట్ కౌన్సిలర్

విద్యార్థులు ఎక్కువగా ఇంట్లో సమస్యలు, హస్టల్ ఇబ్బందులు పట్ల ఆందోళనకు గురవుతుంటారు. అంతేకాకుండా ఇతరత్రా కారణాలతో కూడా ఆందోళన చెందుతుంటారు. పరీక్షలంటే సాధారంగా ఒకలాంటి భయం విద్యార్థుల్లో ఉంటుంది. వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అంతేకాకుండా నిష్ణాతులైన వక్తలతో ప్రత్యేక సెమినార్‌లు కండక్ట్ చేసి విద్యార్థుల్లో ఆత్మసైర్యం నింపేందుకు పనిచేస్తున్నాం. 24/7 టెలీమానస్ ద్వారా మానసిక వైద్యులు అందుబాటులో ఉంటారు.

మాజీ ఎంపీపీపై అట్రాసిటీ కేసు

మద్దూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళితబంధు పథకం పేరిట డబ్బులు వసూలుచేసి మోసం చేసిన విషయమై మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడిగ కృష్ణారెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బద్దిపడిగ కృష్ణారెడ్డి ఎంపీపీగా పనిచేస్తున్న సమయంలో దళితబంధు పథకంలో ఎంపిక చేయిస్తానని రేబర్తి గ్రామానికి చెందిన ఎర్రబచ్చల శ్రీనివాస్‌ను నమ్మించి రూ.2.50లక్షలు తీసుకున్నాడని తెలిపారు. రెండేళ్లు గడిచినా లబ్ధి చేకూరకపోవడంతో తన డబ్బులు చెల్లించాలని కృష్ణారెడ్డిని అడగటంతో కులంపేరుతో దూషించి బెదిరించాడని పేర్కొంటూ శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ ఎస్టీ యాక్టు కింద కేసునమోదు చేశామన్నారు.

బంజారాలు ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న బంజార సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్

హుస్నాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంజారాల డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆల్ ఇండియా బంజార సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బంజారాభవన్‌లో జరిగిన బంజారా ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం నిర్వహించి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు లావుడ్య వీరన్న నాయక్, దరావత్ తిరుపతి నాయక్, భూక్య రమేశ్ నాయక్, సరోజన, బీక్యా నాయక్, వీరన్ననాయక్, కైలు నాయక్, శ్రీను తదితరులున్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



దాసరి శ్రీకాంత్‌కు నియామకపత్రం అందజేస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ చేర్యాల పట్టణాధ్యక్షుడుగా దాసరి శ్రీకాంత్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి పాటుపడాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచించారు. అలాగే పదేళ్లకుపైగా పట్టణాధ్యక్షుడుగా పనిచేసిన మంచాల చిరంజీవులును జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్, పార్టీ నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మామిడాల నాగరాజు, పాల లక్ష్మీనారాయణ, తాటికొండ సదానందం, సనాది భాస్కర్, జహీరుద్దీన్, కాటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మిరుదొడ్డిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మిరుదొడ్డి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం 1996-97 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువతో సన్మానించారు.

కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



గజ్వేల్:అనంతరావుపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను వెంటనే కేంద్ర క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ మండలం అనంతరావుపల్లి చౌరస్తాలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన వెంట నాయకులు కొప్పు రవి, దాసరి రాజు, దాసరి రజనీకాంత్, దామనమైన మల్లేశం, దాసరి కపిల్, మంకిడి రజినీకాంత్, గద్ద రాజు, సిద్ధం భాను, కిష్టయ్య తదితరులున్నారు.

- గజ్వేల్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గజ్వేల్‌లో అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించడమంటే ఈ దేశ అట్టడుగు వర్గాల ప్రజలందరినీ అవమానించినట్టేనని, ఇందుకు అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బిట్ల జ్యోతి, గజ్వేల్ ప్రాంత నాయకులు రమేష్, మెదక్ జిల్లా నాయకులు జుర్రు సుధాకర్‌యాదవ్, చంద్రమౌళి యాదవ్, మహిళా నాయకురాలు లక్ష్మి యాదవ్, మాదిగ జాగృతి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించడంలో ప్రభుత్వం విఫలం



తిమ్మక్కపల్లిలో పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల పొలాలకు నీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన తిమ్మక్కపల్లిలో మాజీ జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి ఇంట్లో శుభకార్యానికి ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌ల నుంచి పొలాలకు సాగునీరు అందించేందుకు పిల్ల కాలువలు పూర్తి చేయాలని తాను ఎన్నిసార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల పొలాలకు నీళ్లు అందించడానికి విస్మరించి, హైదరాబాద్‌కు నీటిని తరలించేందుకు పనులు చేపడుతున్నారని మండిపడ్డారు. అనంతరం పొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్‌తో పాటు నాయకులు హాజరయ్యారు.

కల్వర్టు మరమ్మతులకు మోక్షమెన్నడో?

- అసెంబ్లీ ఎన్నికల ముందు పనులు ప్రారంభం
- అర్ధాంతరంగా ఆగిన నిర్మాణ పనులు
- రోడ్డు కోతకు గురై కంకర తేలి ప్రమాదకరంగా మారిన ప్రయాణం
- వృథాగా పడి ఉన్న పైపులు



వర్షాలకు మట్టి కొట్టుకుపోయి కంకర తేలిన రోడ్డు



వృథాగా కల్వర్టు కోసం తెచ్చిన పైపులు

మద్దూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కపల్లి నుంచి రేబర్తికి వెళ్లే మట్టి రోడ్డులో గ్రామ సమీపాన ఉన్న కల్వర్టు ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. ఆ కల్వర్టు మరమ్మతుల కోసం అందించిన పైపులు వృథాగా పడిఉన్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయం కంటే ముందు కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని లక్కపల్లి గ్రామస్థులు నాయకులకు విజ్ఞప్తి చేశారు. అనుకున్నదే తడవుగా నాయకులు మరమ్మతులు జరిపించేందుకు సుమారు రూ.60 వేలకు పైగా నిధులు వెచ్చించి పైపులు తెచ్చి కల్వర్టు పక్కనే నిల్వచేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

ఏడాది గడిచినా..

అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి ఏడాది గడచిపోయినా, కల్వర్టు మరమ్మతులను పాలకులు విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మరమ్మతులపై పట్టింపులేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ కల్వర్టు మీదుగా ప్రయాణం సాగిస్తున్న సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటుగా ధర్మారం గ్రామం నుంచి లక్కపల్లి మీదుగా రేబర్తి గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరైనా గుత్తేదారు కేవలం ధర్మారం గ్రామం నుంచి లక్కపల్లి బస్టాప్ వరకు కంకరపోసి పనులు చేపట్టాడు. ఈ క్రమంలో నిధులు జాప్యం మూలంగా అర్ధాంతరంగా పనులు నిలిచిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. ధర్మారం గ్రామం నుంచి లక్కపల్లి మీదుగా రేబర్తి గ్రామానికి చేరుకునే సమయంలో వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురి కావడమే కాకుండా అక్కడక్కడా గుంతలు పడి కంకర తేలి ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరు చేయించాలి



ధర్మారం గ్రామం నుంచి లక్కపల్లి మీదుగా రేబర్తి గ్రామం వరకు గల మట్టిరోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డు పొడవునా అక్కడక్కడా గుంతలు పడి, కంకర తేలింది. ఎన్నికల సమయంలో నాయకులు కల్వర్టుకు మరమ్మతులు చేయిస్తామని పైపులు తెచ్చి మరమ్మతులు విస్మరించారు. కల్వర్టుకు నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి. అర్ధాంతరంగా ధర్మారం నుంచి రేబర్తి వరకు నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులు కొనసాగించేలా చూడాలి.

-బొల్లం జయాకర్ లక్కపల్లి గ్రామస్థుడు